క్లుప్తంగా

ఆశీర్వాదం



వరుడితో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని ధనలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం కొలిమిగుండ్ల మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రేణుకాంత్‌రెడ్డి కుమారుడి వివాహానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మండలంలో జరిగిన పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే



విద్యార్థులకు బెల్టులు అందజేసిన దృశ్యం

డోన్ టౌన్ : ఆత్మ రక్షణకు కరాటే ఉపయోగపడుతుందని ఏపీ హైకోర్టు అడ్వకేట్ ప్రశాంతి, కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. స్థానిక శ్రీసుధ స్కూల్లో ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లా స్పోర్ట్స్ కరాటేడు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన బెల్ట్ గ్రేడింగ్ విజేతలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై సర్టిఫికెట్లు, బెల్టులు అందజేశారు. పోటీల్లో పట్టణానికి చెందిన రామ్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు.

రోడ్డు ప్రమాదం ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన రంగడు, రామరాజు

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో ఎక్సెల్ వాహనం ప్రమాదవశాత్తు బోల్తాపడిన సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. డోన్ పట్టణానికి చెందిన మంగలి రామరాజు, రంగడు బుగ్గానిపల్లె గ్రామానికి ఎక్సల్ వాహనంపై వస్తుండగా ఆర్‌ఎస్ రంగాపురంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టారు. ప్రమాదంలో రంగడుకు కాలు విరగగా, రామరాజుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు.

సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూపులు

అవుకు(కొలిమిగుండ్ల): రబీ సీజన్ ప్రారంభమైనందున అవుకు మండలంలో రైతులు సబ్సిడీ శనగ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇంకా రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు కాలేదని రైతులు ఆరోపిస్తున్నారు. పేర్లు నమోదు చేసి డబ్బులు చెల్లించాక ఆర్‌ఎస్‌కేల్లో విత్తనాల పంపిణీ జరిగేందుకు సమయం పడుతుందన్నారు. ఇప్పటికే అదును ఆరిపోయే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీ 25 శాతం కేటాయించడంతో బహిరంగ మార్కెట్‌లో కంటే పెద్దగా వ్యత్యాసం లేకుండా పోతుందన్నారు. అధికారులు స్పందించి సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ ప్రారంభించాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

విజయవాడకు తరలిన విద్యుత్ ఉద్యోగులు



డోన్ రైల్వే స్టేషన్‌లో విజయవాడకు వెళ్తున్న ఉద్యోగులు

డోన్ టౌన్ : విద్యుత్‌శాఖ ఉద్యోగ,కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి డోన్ డివిజన్ నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు రైలులో తరలివెళ్లారు. విద్యుత్‌శాఖ ఉద్యోగలు సంఘం జేఏసీ డోన్ డివిజన్ కన్వీనర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ,కార్మికుల సమస్యలపై, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేక పోవడంతో దశల వారి ఉద్యమాలకు శ్రీకారం చుట్టామని, అందులో భాగంగా సోమవారం విజయవాడ ధర్నా చౌక్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ

డోన్ టౌన్ : స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ప్రార్థన సమయం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ దాతల సహకారంతో బాలింతలు, గర్భిణులు,రోగులకు ఆదివారం రొట్టె,పప్పు,గుడ్డు,పండ్లు పంపిణీ చేశారు.

అమ్మతనానికి ఆపద!

- పెరుగుతున్న రొమ్ము క్యాన్సర్ బాధితులు
- జన్యుపర సమస్యలు, జీవనశైలి కారణాలు
- ప్రాథమిక దశలో నిర్ధారించి చికిత్స తీసుకుంటే మేలు
- ఈ నెల రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం



కర్నూలు(హాస్పిటల్): ప్రతి వ్యక్తి జన్మించాక మొదటగా తీసుకునే ఆహారం తల్లి పాలే. తల్లి తన రక్త మాంసాలను పాలగా మార్చి బిడ్డకు ఇచ్చి ప్రాణం పోస్తుంది. ఇలాంటి అమ్మతనానికి రొమ్ము క్యాన్సర్ మహమ్మారి ఆపద తెస్తోంది. ప్రాథమిక దశలో గుర్తిస్తే ఫర్వాలేదు. లేదంటే రోగం ముదిరి ప్రాణాలను హరించి వేస్తుంది. ఈ నెల రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు పెంచికలపాడు విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్, ఒమెగా క్యాన్సర్ హాస్పిటల్‌లలో బాధితులకు వైద్యసేవలు అందుతున్నాయి. వీటిలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కూడా ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 40 మంది దాకా క్యాన్సర్ వైద్యులు అందుబాటులో ఉన్నారు. వీరి వద్ద చికిత్స పొందుతున్న బాధితుల్లో 27 శాతం మంది రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స సులభమని, సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది చివరి దశలో చికిత్స కోసం వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు.

రొమ్ము క్యాన్సర్ ఇలా వస్తుంది

మహిళ రొమ్ములో ఆరోగ్యకర కణాలు నియంత్రణ లేకుండా పెరగడం వల్ల గడ్డలు ఏర్పడి కాలక్రమంలో క్యాన్సర్‌గా మారే అవకాశం ఉంది. రొమ్ము క్యాన్సర్ దశను క్యాన్సర్ ఉన్న ప్రాంతాన్ని బట్టి నిర్ధారిస్తారు. ఎంత మేరకు క్యాన్సర్ విస్తరించింది, ఎక్కడకు విస్తరించిందనేది కూడా ఈ దశల నిర్ణయంలో కీలకంగా మారుతుంది. రొమ్ము క్యాన్సర్‌లు శరీరంలోని ఎముకలు, ఊపిరితిత్తులు, కాలేయం, మెదడుకు కూడా విస్తరించే అవకాశం ఉంది. రొమ్ము క్యాన్సర్‌తో పలు ప్రమాద కారకాలు మిళితమై ఉంటాయి. కొన్ని నియంత్రించడం కష్టమైతే కొన్నింటిని నియంత్రించవచ్చు.

జిల్లాలో రొమ్ము క్యాన్సర్ కేసులు

సంవత్సరం	సర్జికల్ ఆంకాలజీ	మెడికల్ ఆంకాలజీ	రేడియేషన్ ఆంకాలజీ
2019-20	1,892	2,569	1,802
2020-21	3,658	2,434	3,512
2021-22	4,396	5,236	4,239
2022-23	5,124	5,796	4,939
2023-24	5,775	6,164	5,594
2024-25	5,897	5,999	5,445

వీటిని నియంత్రించలేరు

కుటుంబ చరిత్ర

కుటుంబసభ్యుల్లో ఎవ్వరికైనా రొమ్ము క్యాన్సర్ ఉండి ఉంటే ఆ కుటుంబంలో ఇతరులకు రొమ్ము క్యాన్సర్‌లు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. అయితే జన్యుపరంగా రొమ్ము క్యాన్సర్‌లు వచ్చేందుకు తక్కువ అవకాశాలున్నాయి. మొత్తం రొమ్ము క్యాన్సర్ కేసుల్లో వీటి సంఖ్య చాలా స్వల్పమని వైద్యులు చెబుతున్నారు.

పునరుత్పత్తి చరిత్ర

మహిళలు త్వరగా మెనోపాజ్ దశకు చేరుకుంటే వారికి రొమ్ము క్యాన్సర్‌లు వృద్ధి చెందే అవకాశం అధికంగా ఉంటుంది. ఈస్ట్రోజెన్ హార్మోన్‌కు అధికంగా ఎక్స్‌పోజ్ కావడం వల్ల ఈ ప్రమాదం పొంచి ఉంటుంది.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు

మామోగ్రఫీ స్క్రీనింగ్ ద్వారా ఈ క్యాన్సర్‌లను గుర్తిస్తారు. రొమ్ములో ఏదైనా అసాధారణతను గుర్తించేందుకు ఈ రేడియోగ్రాఫిక్ సాంకేతికత ఉపయోగిస్తారు. 40 ఏళ్ల దాటిన మహిళలు ఏడాదికి ఒకసారి మామోగ్రామ్ పరీక్షలు చేయించుకోవడం ముఖ్యం.

వీరు జాగ్రత్తగా ఉండాలి

- శారీరకంగా చురుగ్గా లేనివారు
- ఊబకాయం/అధిక బరువు ఉన్నవారు
- హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపి చేయించుకున్న వారు
- 30 ఏళ్ల తర్వాత మొదటి గర్భం దాల్చిన వారు
- సంతానానికి పాలివ్వని వారు
- మద్యం సేవించేవారు

ఇలా చేయాలి

- పౌష్టికాహారం తీసుకోవడం
- శారీరక వ్యాయామాలు చేయడం
- సరైన బరువు నిర్వహించుకోవడం

రొమ్ము క్యాన్సర్ లక్షణాలు

- రొమ్ముల్లో గడ్డలు/బరువుగా అనిపించడం
- రొమ్ముల ఆకృతి, పరిమాణం మారడం, నొప్పి
- చనుమొనల నుంచి ద్రవాలు కారడం
- చనుమొనల చుట్టూ ఎరుపుగా దద్దుర్లు ఉండటం
- చర్మపు రంగులో మార్పులు

ఉచితంగా క్యాన్సర్ వైద్యసేవలు



కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక వసతులు, పరికరాలు అందుబాటులో ఉన్నాయి. మెడికల్, సర్జికల్, రేడియేషన్ ఆంకాలజీకి సంబంధించిన వైద్యులు ఉన్నారు. ఇక్కడ అన్ని రకాల క్యాన్సర్లకు వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆసుపత్రికి వస్తున్న క్యాన్సర్లలో 30 నుంచి 40 శాతం మంది రోగులు కేవలం రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. రొమ్ము క్యాన్సర్‌ను నిర్ధారించేందుకు త్వరలో మామోగ్రఫి స్కాన్ మిషన్ రానుంది.

– డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, డైరెక్టర్, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, కర్నూలు

ముందుగా గుర్తిస్తే నివారణ



నా 16 ఏళ్ల సర్వీసులో 7 వేలకు పైగా రొమ్ము క్యాన్సర్ కేసులకు సర్జరీలు చేశాను. చాలా మంది బాధితులు 2, 3వ దశల్లో చికిత్స కోసం వస్తున్నారు. అలాగాకుండా ముందుగా మామోగ్రఫి, ఎక్స్‌రే పరీక్షలు చేయించుకుని వస్తే రొమ్ము తీసేయాల్సిన అవసరం లేకుండానే చికిత్స అందించవచ్చు. ముందుగా గుర్తించడం ద్వారా మాత్రమే క్యాన్సర్‌ను నియంత్రించడం సాధ్యమవుతుంది. 40 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఈ పరీక్షలు చేయించుకోవాలి. ముందుగా పరీక్షలు చేయించుకోవడం వల్ల అమెరికా, యుఎస్‌లలో ఎక్కువ మంది కోలుకుంటున్నారు.

–డాక్టర్ బి.రవీంద్రబాబు, సర్జికల్ ఆంకాలజిస్టు, కర్నూలు

56 ఉపాధ్యాయ పోస్టుల కేటాయింపు

కొలిమిగుండ్ల: ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా మండలానికి 56 ఉపాధ్యాయ పోస్టులు కేటాయించినట్లు ఎంఈఓ అబ్దుల్ కలాం ఆదివారం తెలిపారు. ఎంపికై న అభ్యర్థులకు మాన్యువల్, వెబ్‌కౌన్సిలింగ్ ద్వారా పాఠశాలలు కేటాయించారన్నారు. 42 ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 3, హిందీ 2, తెలుగు 1 చొప్పున మంజూరైనట్లు చెప్పారు. అలాగే కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె, చింతలాయిపల్లె ఉన్నత పాఠశాలలకు ఫిజికల్ డైరక్టర్లు(పీడీ) పోస్టులు కూడా వచ్చాయన్నారు. 56 మంది ఉపాధ్యాయులు సోమవారం కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరుతారని వెల్లడించారు.

కల్తీ మద్యంపై నేడు నిరసన

బనగానపల్లె : కల్తీమద్యానికి నిరసనగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు బనగానపల్లె ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో వినతి పత్రం అందజేయనున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జయప్రదం చేయండి

డోన్ టౌన్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కల్తీ మద్యం తయారీపై మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం చేపడుతున్న నిరసన ర్యాలీలో ప్రజలు, నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని స్థానిక పార్టీ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. బుగ్గన స్వగృహం నుం,ఇ 9.30 గంటలకు ర్యాలీగా బయలుదేరి పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వరకు వెళ్లి అక్కడ నిరసన తెలియజేస్తామని పేర్కొంది.

సభ కోసం భూములను నాశనం చేశారు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగమనాయుడు

కొలిమిగుండ్ల: ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు పర్యటనలో భాగంగా నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభ కోసం రైతుల పచ్చని పంట పొలాలను నాశనం చేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగమనాయుడు ఆరోపించారు. ఆదివారం కొలిమిగుండ్లలోని షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.346 కోట్లు ఖర్చుపెట్టి నిర్వహిస్తున్న సభ కోసం బలవంతంగా రైతుల పొలాలను ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. సభ జరుపుకునేందుకు కర్నూలు నగరంలోనే ఎస్టీబీసీ కళాశాల మైదానం, మున్సిపల్ కాలేజీ గ్రౌండ్‌తో పాటు ఇతర స్టేడియాలు ఉన్నాయని, వాటిని వదలిపెట్టి పంట పొలాల్లో ఏర్పాటు చేయడం మంచిది కాదన్నారు. పార్కింగ్‌కు 350 ఎకరాలు, సభ ప్రాంగానికి 60 ఎకరాలు కేటాయించి ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ప్రధాని మోదీ వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇంత వరకు హామీ అమలు కాలేదన్నారు. పలు రకాల సమస్యలపై ఈనెల 15న పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టబోతున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు సంజీవులు, మహేష్, దేవుడు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న నాయకులు



వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

బేతంచెర్ల: మండలంలోని బుగ్గానిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో వినాయక, అంకాలమ్మ, దుర్గమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పండితులు వేద మంత్రోచ్చారణ మధ్య యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, గిడ్డంగుల శాఖ మాజీ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు మురళీ కృష్ణ, మధు, సూర్య బళ్లాని, చలపతిరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్వీ కృష్ణారెడ్డి, రామపక్కీర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో కరువు భత్యం చెల్లిస్తున్నా కూటమి సర్కారు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన కరువు భత్యం 15 నెలలు దాటినా ఇవ్వడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక రీతి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను మరో రీతిలో చూసే డబుల్ ఇంజన్ సర్కార్ ధోరణి మారాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక పర అంశాలన్నింటినీ మెడికల్ బిల్స్, సరెండర్ లీవ్, గ్రాట్యుటీ తర్వగా చెల్లించాలని, లేని పక్షంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శులు ధనుంజయ, చాంద్ బాషా, భాస్కరరెడ్డి, నాయకులు రవిప్రకాష్, సుమన్, మాధవరెడ్డి, కేవీ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతే సమాచార హక్కు చట్టం ఉద్దేశం



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పాలనలో పారదర్శకత, అధికారుల్లో జవాబు దారి తనం పెరగాలన్నదే సమాచార హక్కు చట్టం ఉద్దేశమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమల్ల రహీం అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం సమాచార హక్కు చట్టం 20వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాల పట్ల ప్రజలు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాచార హక్కు చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టం కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మస్తాన్‌వలి, కార్యదర్శి సత్యనారాయణ, రహమతుల్లా, శివరామిరెడ్డి, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

బహుళజాతి కంపెనీలకు దోచిపెడుతున్న మోదీ

ఆత్మకూరు: డిజిటల్ అగ్రీ మిషన్ పేరుతో ప్రభుత్వ భూములను, పేదల భూములను ప్రధాని మోదీ బహుళజాతి కంపెనీలకు దోచిపెడుతున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి కేంద్రప్రభుత్వాన్ని ఆరోపించారు. ఆదివారం ఎంఎంకే ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలో కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. 2014లో బీజేపీ ఇచ్చిన వాగ్దానాలు ఆకర్షించాయని, అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చడంలో ప్రధాని విఫలమయ్యారని విమర్శించారు. ఎన్నికల ముందు ఒక మాట.. ఎన్నికల తర్వాత మరో మాట చెప్పి రైతులను నట్టేట ముంచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం విధానాల వల్ల గంటకు ఒక రైతు చొప్పున ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. రూ.4,500 కోట్ల ఆస్తులను రూ.450 కోట్లకే అంబానీ కుటుంబాలకు కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు.

ప్రధాని పర్యటనపై మంత్రి సమీక్ష

బనగానపల్లె రూరల్ : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటనపై రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పలుశాఖల అధికారులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక మంత్రి బీసీ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈ నెల 16న కర్నూలు పర్యటన వస్తున్నారని, పర్యటనకు బనగానపల్లె నియోజకవర్గం నుంచి వచ్చే ప్రజలకు తగిన ఏర్పాట్లు చేయాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాలాంజనేయులు, డ్వామా ఏపీడీ సాంబశివారావు, వెలుగు ఏపీఎం హజరత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. అమడాల, గుంజలపాడు, జోళదరాశి, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం,అల్లూరు, కొత్తపల్లె, కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని ఆయా గ్రామాలకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉంటుందని పేర్కొన్నారు.

దేవీతత్త్వంపై ప్రవచనం



ప్రవచనం వినిపిస్తున్న ప్రవాచకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఎం మహంతయ్య వారిచే దేవీతత్త్వంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా కృతజ్ఞతార్పణల పండుగ

నంద్యాల(న్యూటౌన్): దశమ భాగం దేవునికి చెల్లిస్తే దేవుడు మెండైన దీవెనలు కుటుంబాలకు ప్రసాదిస్తాడని నంద్యాల డయాసిస్ ట్రెజరర్, పరిశుద్ధ మత్తయి ఆలయం పాస్టరేట్–3 డీనరీ చైర్మన్ రెవరెండ్ నందం ఐజక్ గురువులు అన్నారు. ఆదివారం పాస్టరేట్–3 (పరిశుద్ధ మత్తయి ఆలయం)లో కృతజ్ఞతార్పణల పండుగ, కోత పండుగ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఏడాదికి ఒక సారి ఈ అర్పణాల పండుగను జరుపుకుంటామని, క్రీస్తు ద్వారా పొందిన మేలును దశమ భాగంలో క్రైస్తవులు ధనం, ధాన్యం ఇస్తారని తెలిపారు. పాస్టరేట్–3 ఆలయ పరిధిలో ఉన్న చిన్న పిల్లలతో మొదలుకొని పెద్దల వరకు కుటుంబాలుగా పాల్గొని గురువులతో దైవదీవెనలు పొందారు. క్రైస్తవులు క్రీస్తు అడుగు జాడల్లో నడవాలని మత పెద్దలు సూచించారు. కార్యక్రమంలో పాస్టరేట్–3 సెక్రటరీ సంజీవకుమార్, ట్రెజరర్ సెల్వరాజ్, గురువులు రవీంద్ర, రవికుమార్, సంఘ సభ్యులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

15న నిరసన కార్యక్రమం

నంద్యాల(న్యూటౌన్): ఏపీకి ఇచ్చిన హామీలను విస్మరించినందుకు పీఎం మోదీ గో బ్యాక్ అంటూ ఆర్‌ఎస్‌పీ రేవల్యూషన్ సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో 15వ తేదీన నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయ నిర్మాణానికి, అమరావతి నిర్మాణానికి నిధులు, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని, కడపలో ఉక్కు కర్మాగారం నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు సుబ్బయ్య, అబ్రహాం, శివ, రవి, మనోహర్, అమర్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

డోన్ టౌన్ : రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను ప్రధాని మోదీ నెరవేర్చి జిల్లా పర్యటనకు రావాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్,సీఐటీయు ప్రధాన కార్యదర్శి శివరామ్ పేర్కొన్నారు. మోదీ పర్యటనను నిరసిస్తూ ఈనెల 14వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు,గనులు,కడపలో స్టీల్ ప్లాంట్, కేంద్ర విశ్వ విద్యాలయం నిర్మాణానికి అనుమతులు ఇస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జిల్లా పర్యటనకు ఎలా వస్తారని ప్రశ్నించారు. రాజధాని నిర్మాణానికి ప్రత్యేక ప్యాకేజీ పేరుతో అప్పులు ఇస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారని ఆరోపించారు. జీఎస్టీ పేరుతో ఇప్పటి వరకు లక్షల కోట్ల ప్రజల నుంచి దోచుకొని నేడు రూ.48వేల కోట్లు తగ్గించామని పండుగ చేసుకోవడం దారుణం అన్నారు. నాయకులు చిన్న రహిమాన్,రామాంజనేయులు,నాగమద్దయ్య,షమీమ్ బేగం ఉన్నారు.

స్వచ్ఛ సేవకులకు ఆత్మీయ సన్మానం

నంద్యాల(వ్యవసాయం): అమరయోగ వికాస కేంద్రంలో ఆదివారం మన ఊరు–మనగుడి, మన బాధ్యత స్వచ్ఛ సేవకులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కార్తిక జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గుంటూరు ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన గుడి, మన బాధ్యత సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర అవార్డు అందజేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,500 మంది సభ్యులు కలిగిన తమ సంస్థ 300కు పైగా గుడులు, కోనేర్లు, బావులను శుభ్రం చేసిందన్నారు అనంతరం శివకుమార్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. అదే విధంగా స్వచ్ఛ సేవకులకు పూల వర్షం కురిపించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రఘువీర్, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, శేఖరప్ప, రాంప్రసాద్, బాబురావు, ఎస్.వెంకటేశ్వర్లు, తదితర సేవకులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులు

47 ఏళ్ల తర్వాత

- పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆళ్లగడ్డ: ఒకటి కాదు. రెండు కాదు ఏకంగా నలభై ఏడేళ్ల స్నేహం వారిది. తమ పిల్లలు పిల్లలకు పెళ్లిలై మనుమండ్లు, మనువరాళ్లు సైతం పెళ్లీడుకు వచ్చారు. అయినా వారే పిల్లలుగా మారారు. బాల్యం నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. నాడు ఆడిపాడిన పాఠశాల తరగతి గదులను మరోసారి చూసి తన్మయత్వం పొందారు. నాటి చిలిపి చేష్టలు, అల్లరి పనులను నెమరు వేసుకున్నారు. జ్ఞాపకాల దొంతరులు తెరచి, కబుర్లు చలోక్తలు, ముచ్చట్లలో మునిగారు. స్నేహితులతో పరాచకాలాడి.. అలనాటి నిక్‌నేమ్‌లతో పిలుచుకుని ఆనందాలు పంచుకున్నారు. స్థానిక నమో నారాయణ తపో వనములో 1977 – 78 లో వైపీపీఎం ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక సమావేశం ఆదివారం నిర్వహించారు. నాలుగున్నర దశాబ్దాల కిందటి అనుభూతుల్ని పంచుకున్నారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులైన ఎద్దుల విక్రమదేవరెడ్డి, శ్రీనాథ్, రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు నాటి విద్యాబోధన, విద్యాభివృద్ధికి సంబంధించిన అంశాలను గుర్తుచేశారు.

ప్రతి ఇంట్లో వెలుగులు నిండాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

ఓర్వకల్లు: దీపావళి జ్ఞాన జ్యోతి వెలుగులు ప్రతి ఇంట్లో వెలగాలని ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యుడు రామచంద్రుడు ఆకాంక్షించారు. దీపావళి పండుగ పురస్కరించుకొని మండలంలోని ఎస్.కొంతలపాడు, హెచ్.కొట్టాల గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు రామచంద్రుడు మాట్లాడుతూ.. ×గురువు తమ జ్ఞానాగ్నితో శిష్యుల తలలో జ్ఞాన జ్యోతిని వెలిగించి యోగ మార్గంలో నడిపిస్తాడనేందుకు గుర్తుగా దీపావళి రోజున ప్రతి ఇంట్లో దీపాలను వెలిగించాలని పేర్కొన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు గోకారి, శ్రీనివాసులు, రవి, జగదీశ్, సుబ్బలక్ష్మి, సుజాత, హైమావతి, రమణమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆదివారం ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులు అమ్మవారికి నూతన వస్త్రాలు, పిండివంటలు సమర్పించి మొక్కులు చెల్లించారు.